# ఆధునిక నీతి కథలు



## తాళ్ళూరు నాగేశ్వరరావు

జానకిరామయ్య ఎలిమెంటరీస్కూలు హెడ్మాస్టరుచేసి రిటైర్ అయ్యాడు. ఆయన ఉద్యోగకాలంలో 'దుక్కి-టెద్దు' లాగా పనిచేసే మంచి ఉపాధ్యాయుడు అని పేరు మాత్రం తెచ్చుకున్నాడు గానీ సంపాయించి వెనక వేసింది అయిదు పచ్చనోట్లుకూడా లేవు. అయితే ఆయనకు పిల్లలు ఎక్కువ మంది లేరు. భార్య జానకమ్మ పదహారో ఏటనే కాపురానికొచ్చినా మొత్తం మీద ముగ్గురు పిల్లల్ని కన్నది. ఇద్దరు మగపిల్లలూ, ఒక ఆడపిల్ల. అయితే దురదృష్టవశాత్తూ ఇద్దరు మగపిల్లలూ రెండేళ్ళు నిండకుండానే ఈ లోకంతో తెగతెంపులు చేసుకొన్నారు- మాయదారి రోగాలు వచ్చి.

ఆ ఆడపిల్లను ఆ దంపతులు అల్లారుముద్దుగా పెంచారు జాగ్రత్తగా చదువు చెప్పించారు. ఊళ్ళో చదువు అయిపోయినా బస్తీకి పంపించి హాస్టల్లో వుంచి, బి. ఎ ఎం. ఏ. చదువు చెప్పించారు. అందగత్తె, బుద్ధిమంతురాలూ అయిన సీతాలత ఎం. ఏ. ఎకనామిక్స్ ఫస్టుక్లాసులో ఉత్తీర్ణురాలైంది.

సీతాలతకు విజయవాడలో ఒక స్త్రీల కళాశాలలో ఏ సిఫార్సూ లేకుండానే లెక్చరర్ ఉద్యోగం వచ్చింది

అప్పటికి జానకిరామయ్య రిటైర్ అయ్యాడు.

తల్లిదండ్రుల్ని ఇద్దర్నీ విజయవాడ తీసుకొచ్చింది సీతాలత- వాళ్లను పోషించే బాధ్యతను గుర్తెరిగి

సీతాలత రోజూ కాలేజీకి వెళుతూన్నది.

ప్రతి సంవత్సరం కాలెండరు మారినప్పుడల్లా ఆమెకు ఇంక్రిమెంట్ వస్తోంది.

సీతాలతకు పాతికేళ్ళ వయసొచ్చింది. ఆమె లావణ్యశోభ మసకబారుతోంది. మృదుత్వం మొద్దుబారిపోతుంది. గెల వేయని అరటిచెట్టువలె తయారవుతోంది. కాని జానకిరామయ్యగానీ ఆయన భార్యగానీ కూతురికి పెళ్లి ప్రయత్నాలు తలపెట్టడంలేదు. సీతాలతకు ఆశ్చర్యంగానూ ఆవేదనగానూ వుంది.

ఉద్యోగంచేసే ఆడపిల్ల పెళ్ళి-౬

కాని నోరుతెరిచి చెప్పకోలేకపోతోంది. తనకి పెళ్ళిసంబంధాలు తన తల్లిదండ్రులు వెతక్కపోవడంలో అంతర్యాన్ని ఆమె గ్రహించింది. తనకు పెళ్ళి చేస్తే ఇప్పుడు తను సంపాదించేది తమకు దక్కదని, తాము నిశ్చింతగా, సుఖంగా బ్రతకటానికి అవకాశం వుండదని. పిల్లలపట్ల తల్లిదండ్రులకు కూడా ఇలాంటి స్వార్థముంటుందా?

ఓ రోజు జానకిరామయ్య చెల్లెలు వచ్చింది వాళ్ళ ఇంటికి చుట్టపు చూపుగా. వెళుతూవెళుతూ అంది వదినతో.

"సీతాలత పెళ్ళెప్పుడు చేస్తారు? ఇంకా సంబంధాలు చూడటంలేదా వదినా?"

జానకమ్మ మొగుడికేసి మేఘం కమ్మిన మొహంతో చూసింది. జానకిరామయ్య వినిపించుకోనట్టుగా గోడమీద బల్లికేసి చూశాడు.

"మా అమ్మకు ఆ కాలంలో పదహారో యేట పెళ్ళయింది. ఈ కాలంలో నాకు ఎన్నో యేట పెళ్ళిచేయాలో ఇంకా వాళ్ళు ఆలోచించలేదు అత్తయ్యా!" అంది సీతాలత ఉక్రోషంతో కూడుకున్న వ్యంగ్య ధోరణితో.

*ఉద్యోగాలు చేస్తూ సంపాయించే ఆడపిల్లలు ఇంట్లో వుంటే కొంతమంది తల్లిదండ్రులు వాళ్ల పెళ్ళిళ్ల జోలి పట్టించుకోరు.*

